సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



రైతుల వివరాలు సేకరణ

రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించేందుకు వ్యవసాయ అధికారులు గురువారం సర్వే చేపట్టారు.

- 9లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 590.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 3,48,235 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 2,93,850 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,461 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,387 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8,280 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	643.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 538.08 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 539.02 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 263.34 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 215.46 క్యూసెక్కులు

నిధుల్లేక.. పనులు సాగక..

ఎక్కడికక్కడ నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని బస్వాపూర్ రిజర్వాయర్
- మొదలేకాని 'గంధమల్ల' పనులు
- అటకెక్కిన మూసీ కాల్వల ఆధునీకరణ
- భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై నేడు సమీక్ష సమావేశం
- హాజరుకానున్న మంత్రి ఉత్తమ్

సాక్షి యాదాద్రి : జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. సరైన కేటాయింపులు లేకపోవడంతో పనులు ఆగుతూ సాగుతున్నాయి. రెండేళ్ల క్రితమే పూర్తి కావల్సిన బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం తుది దశలో నిలిచిపోయింది. ఐదేళ్ల క్రితం ప్రతిపాదించిన గంధమల్ల రిజర్వాయర్ పనులు.. ఇప్పటికీ మొదలే కాలేదు. ఇక మూసీ కాల్వల ఆధునీకరణ పనులు ఏడుళ్లు గడుస్తున్నా దరికి చేరడం లేదు. ఫలితంగా సాగునీటికోసం రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులు, కాలువలపై శుక్రవారం భువనగిరిలో సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో రైతుల్లో ఆసక్తి నెలకొంది.



నిలిచిపోయిన బస్వాపూర్ రిజర్వాయర్ పనులు

బస్వాపూర్‌కు రూ.450 కోట్లు అవసరం

కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలో భాగంగా భువనగిరి మండలంలో నిర్మిస్తున్న బస్వాపూర్ రిజర్వాయర్ పనులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల క్రితం ప్రారంభించారు. రిజర్వాయర్ సామర్థ్యం 11.39 టీఎంసీలు కాగా తొలిదశలో ఒక టీఎంసీతో నింపి రైతులకు సాగునీరు అందజేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, ఇంకా 20 శాతం పనులు పెండింగ్ ఉన్నాయి. పనులు పూర్తి చేయడానికి రూ.450 కోట్లు కావాల్సి ఉంది. ఇందులో ముంపు గ్రామాలైన భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలం చొంగల్ తండా, లక్ష్మీనాయకుడితండాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.250 కోట్లు, భూ నిర్వాసితులకు రూ.200 కోట్లు చెల్లించాల్సి ఉంది. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి వడపర్తి కత్వ మీదుగా భువనగిరి, బీబీనగర్ చెరువులను నింపడానికి చేపట్టిన కాల్వల పనులకు నిధులు కేటాయించాల్సి ఉంది.

ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రి సమీక్ష

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, కాలువల పనులు, వాటి పురోగతి తదితర అంశాలపై నీటి పారుదల శాఖ మంత్రి గురువారం సమీక్షించనున్నారు. భువనగిరిలోని న్యూ డైమెన్షన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీ చామలకిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీలతో పాటు భువనగిరి, నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు, జనగామ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలు, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు హాజరుకానున్నారు. కాగా మంత్రి ఉత్తమ్ హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 12.30 గంటలకు భువనగిరి రానున్నారు. 2.30 నుంచి సమీక్ష నిర్వహించనున్నారు.

'గంధమల్ల' పనులు మొదలయ్యేనా?

ఆలేరు నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించేందుకు తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువును రిజర్వాయర్ చేయాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. ఐదేళ్లు గడిచినా ఇప్పటి వరకు గంటెడు మట్టి కూడా తీయలేదు. రిజర్వాయర్‌ను 9.8 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని గత సర్కార్ నిర్ణయించింది. కానీ.. ముంపు సమస్య, భూ సేకరణ అధికంగా ఉండడంతో 1.5 టీఎంసీలకు తగ్గిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక జనగామ జిల్లా తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి ఆలేరు నియోజకవర్గానికి సాగు నీరందించే కాలువలకు నిధులు కావాల్సి ఉంది.

రుద్రమ్మ రిజర్వాయర్ కోసం రైతుల డిమాండ్

తుంగతుర్తి నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేందుకు నిర్మించతలపెట్టిన రుద్రమ్మ రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయాలని అక్కడి రైతులు ఎంతోకాలంగా మంత్రులు, ఎమ్మెల్యేలను డిమాండ్ చేస్తున్నారు. అయినా ఇప్పటివరకు అతీగతి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ కల సాకారం చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే మనుగోడు నియోజకవర్గాల్లో పలు ప్రాజెక్టులకు పెండింగ్‌లు ఉన్నాయి.

పెరిగిన మూసీ కాల్వల బడ్జెట్

మూసీ వృథా జలాలను సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలను ఆధునీకరించాలని నిర్ణయించింది. తద్వారా ఆయకట్టు విస్తీర్ణం మరింత పెంచాలన్నది కూడా లక్ష్యం. నాడు కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీనికి తోడు అధికారుల ఉదాసీనత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా బడ్జెట్ పెరిగిపోయింది. తాజా అంచనాల ప్రకారం పిలాయపల్లికి రూ.95.60 కోట్లు, బునాదిగాని కాల్వకు రూ.159.03 కోట్లు, ధర్మారెడ్డి కాలువకు రూ.129.80 కోట్లు అవసరం అవుతాయనని నీటిపారుదల శాఖ అధికారులు అంచనాలు వేశారు.



ఆనవాళ్లు కోల్పోయిన ధర్మారెడ్డి కాలువ

న్యూస్‌రీల్

కనుల పండువగా లక్ష పుష్పార్చన



ఉత్సవ మూర్తులకు లక్షపుష్పార్చన చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్ : ఏకాదశిని పురస్కరించుకొని గురువారం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో లక్షపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాలయం ముఖమండపంలోని ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించారు. సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పూలతో లక్షపుష్పార్చన నిర్వహించారు. అంతకుముందు వేకువజామున స్వామి వారి ప్రధానాలయాన్ని తెరచిన అర్చకులు.. శ్రీస్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీదళాలతో అర్చనలు చేశారు. ఆ తర్వాత భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకళ్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి,అమ్మవారి జోడు సేవలను మాడవీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా రూ.40,12,733 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్ రావు తెలిపారు.

రూ.16 తప్పనిసరిగా చెల్లించాలి

భువనగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆసరా లబ్ధిదారులకు ఇస్తున్న పింఛన్ డబ్బుల్లో 16 రూపాయలు తప్పనిసరిగా చెల్లించాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. దివ్యాంగులకు రూ.4,016, ఇతర లబ్ధిదారులకు రూ.2,016 చొప్పున ప్రతినెలా తపాలా కార్యాలయాల్లో చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. అయితే లబ్ధిదారులకు రూ.4వేలు, రూ.2వేలు మాత్రమే ఇస్తున్నారని, చిల్లర సమస్యతో రూ.16 ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు కూడా పూర్తిస్థాయి పింఛన్ ఇవ్వనిపక్షంలో అడిగి తీసుకోవాలన్నారు.

గుట్ట ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ వై.కృష్ణ

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట ట్రాఫిక్ నూతన సీఐగా వై.కృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. రాచకొండ కమిషనరేట్ కార్యాలయం నుంచి కృష్ణ బదిలీపై యాదగిరిగుట్టకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రవికుమార్ బదిలీపై చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కాగా యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన సీఐ పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు.



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్ తదితరులు

ఆలయాల సందర్శన.. అభివృద్ధిపై సమీక్ష

- ముగిసిన గవర్నర్ పర్యటన
- కొలనుపాక ఆలయాలు, స్వర్ణగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు
- కలెక్టరేట్‌లో ప్రముఖులతో సమావేశం

భువనగిరి, ఆలేరు రూరల్ : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జిల్లా పర్యటన ఉత్సాహంగా సాగింది. ఈనెల 27న యాదాద్రికి వచ్చిన గవర్నర్, మరోసారి గురువారం జిల్లాలో పర్యటించారు. మధ్యాహ్నం 3.30నుంచి రాత్రి 8.30 గంటల వరకు దాదాపు ఆరు గంటల పాటు జిల్లాలో గడిపారు. తొలుత 3.30కి ఆలేరు మండలం కొలనుపాకలోని జైనదేవాలయానికి గవర్నర్ చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవర్నర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సోమేశ్వర దేవాలయంలో అభిషేకం చేసి కోటొక్క లింగాన్ని దర్శించుకున్నారు. 3.56 నిమిషాలకు సోమేశ్వర ఆలయం నుంచి భువనగిరి శివారులోని స్వర్ణగిరి క్షేత్రానికి గవర్నర్ బయలుదేరి వెళ్లారు. అక్కడ శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పద్మావతి, అలివేలుమంగమ్మ, 21 అడుగుల ఏకశిలా హనుమంతుని విగ్రహం వద్ద, జల నారాయణుడికి పూజలు చేశారు.స్వామివారి గంట మోగించారు.కళ్యాణ మండపాన్ని పరిశీలించి నిర్మాణ పనుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తిరుమల తిరుపతి తరహాలో స్వర్ణగిరి క్షేత్రం అద్భుతంగా ఉందన్నారు. అంతకుముందు ప్రధానార్చకులు గవర్నర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధానార్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు గవర్నర్‌కు ఆశీర్వచనం అందజేశారు. ధర్మకర్త మానేపల్లి రామారావు, చైర్మన్లు మానేపల్లి గోపికృష్ణ, మురళీ గవర్నర్‌ను సన్మానించి స్వామి వారితీర్థ ప్రసాదాలు అందజేశారు.



కొలనుపాకలో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, ప్రభుత్వ విప్ అయిలయ్య

ప్రముఖులతో సమావేశం

స్వర్ణగిరి క్షేత్రం నుంచి గవర్నర్ నేరుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అధికారులతో సమావేశమై సంక్షేమ పథకాల అమలుతీరుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం కళాకారులు, రచయితలు, వివిధ రంగాల్లో జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన ప్రముఖులతో సమావేశం అయ్యారు. వారు అందించిన సేవల గురించి తెలుసుకుని అభినందించారు.

స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు, అధికారులు

గవర్నర్‌కు ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జండగే, డీసీపీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఆర్డీఓ అమరేందర్, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, నాయకులు జనగాం ఉపేందర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గంగుల శ్రీనివాస్, తుంగకుమార్, ప్రమోద్‌కుమార్, రవికుమార్ తదితరులు స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లో పోలీసులు గౌరవ వందనం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ వందన సమర్పణ చేశారు. బతుకమ్మలు, బోనాలతో మహిళలు స్వాగతం పలికారు.

నేడు యాదాద్రిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

యాదగిరిగుట్ట రూరల్ : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారని, ఈ క్రమంలో ఉచితంగా వ్రతాలు నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించిందని పేర్కొన్నారు. ఇందుకోసం కొండ దిగువన సత్యనారాయణ స్వామి వ్రత మండపాన్ని సిద్ధం చేశామని, 200 వరకు వ్రతాలు జరగనున్నాయని ఈఓ వెల్లడించారు.

రేపు భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

భువనగిరి టౌన్ : భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరగనుంది. మొత్తం 14 ఎజెండా అంశాలను తీర్మానానికి ప్రవేశపెట్టనున్నారు. ఇకుడు గుంతల నిర్మాణానికి నిధుల కేటాయింపు, గణేష్ నిమజ్జనానికి భువనగిరి, రాయగిరి చెరువుల వద్ద ఏర్పాట్లు, బతుకమ్మ పండుగకు పెద్దచెరువు, ప్రభుత్వ కళాశాల, వార్డుల్లో విద్యుత్ లైట్లు, ఇతర ఖర్చులు, మొహర్రం పండుగకు పీర్ల చావిడిల వద్ద చేసిన ఏర్పాట్లు తదితర అంశాలు ఆమోదం పొందాల్సి ఉంటుంది.



• పాలనురగలా..

కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరద రావడంతో అధికారులు గురువారం ప్రాజెక్టు మొత్తం 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. క్రస్టు గేట్ల నుంచి నీరు కిందకు దుముకుతూ తెల్లగా పాల నురగవలె కనిపించింది.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

- భువనగిరి ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

భువనగిరి : షరతులు లేకుండా అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం భువనగిరి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హతలున్నా వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కాని రైతులు పనులు మానుకొని రైతువేదికలు, బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.31 వేల కోట్లు విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. మార్గదర్శకాలను సవరించకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రైతువేదికల ద్వారా కాకుండా గ్రామసభలు ఏర్పాటు చేసి సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ముగుస్తున్నా రైతుభరోసా సాయం ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి పాండు, మాటూరి బాలరాజుగౌడ్, దయ్యాల నర్సింహ, మాయ కృష్ణ, రైతు సంఘం జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

మార్పు ఎవరికోసమో?

చౌటుప్పల్ వద్ద 'రీజినల్' జంక్షన్ అలైన్‌మెంట్‌ను ఇష్టానుసారంగా మార్చారన్న ఆరోపణలు

- తూర్పు వైపున అందుబాటులో ప్రభుత్వ భూములు
- అయినా పడమర దిశకు అలైన్‌మెంట్ మార్పు
- పెద్ద ఎత్తున భూములు, ప్లాట్లు కోల్పోతున్న సామాన్య, మధ్య తరగతి వర్గాలు

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా చౌటుప్పల్ వద్ద నిర్మిస్తున్న జంక్షన్ అలైన్‌మెంట్ మార్పుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తూర్పు వైపున ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ.. పడమర దిక్కుకు అలైన్‌మెంట్ జరపడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. బడాబాబులు, కొన్ని పరిశ్రమలను కాపాడేందుకు అలైన్‌మెంట్‌ను ఇష్టానుసారంగా మార్చారని సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మారిన అలైన్‌మెంట్‌తో తమకు జీవనాధారమైన వ్యవసాయ భూములతో పాటు నివాస గృహాలు, ఇళ్ల స్థలాలు కోల్పోవాల్సి వస్తుందని, ప్రభుత్వం చెల్లిస్తానంటున్న నష్ట పరిహారం కూడా సంతృప్తికరంగా లేదని బాధితులు వాపోతున్నారు.

కిలోమీటరున్నర పరిధిలో జంక్షన్ .. జయభూమి వెంచర్‌లో అమ్మానాన్న అనాథాశ్రమం వద్ద జంక్షన్ ప్రారంభమై శ్రీని ఫార్మ కంపెనీ దాటిన తర్వాత ముగియనుంది. డబుల్ డంబెల్ ఆకారంలో సుమారు కిలోమీటరున్నర విస్తీర్ణంలో జంక్షన్ నిర్మాణం చేయనున్నారు. అయితే మొదటిసారి రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఎవ్వరికీ పెద్దగా నష్టం జరగలేదు. కానీ, భవిష్యత్ అవసరాల దృష్ట్యా జంక్షన్‌ను విస్తరించాలని నిర్ణయించిన జాతీయ రహదారుల సంస్థ.. అలైన్‌మెంట్ మార్చింది. కాగా తూర్పు వైపున ఇనాం, లావుని, ప్రభుత్వ, గోల్డెన్ ఫారెస్ట్‌కు సంబంధించిన భూములు పెద్ద ఎత్తున అందుబాటులో ఉన్నాయి. అలైన్‌మెంట్‌ను తూర్పువైపునకు 100 మీటర్లు మారిస్తే వందలాది మంది నష్టపోకుండా ఉండే అవకాశం ఉంది. కానీ, పడమర వైపు వెంచర్లు, వ్యవసాయ భూములు, నివాసగృహాల సముదాయాల మీదుగా హద్దులు వేయడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు నష్టపోతున్నారు.



జంక్షన్ నిర్మాణంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కోల్పోతున్న ప్లాట్లు, పాఠశాల భవనం

181 ఎకరాల భూ సేకరణ

జంక్షన్ విస్తరణ కోసం 181ఎకరాల భూమి సేకరించేందుకు శాటిలైట్ సర్వే చేపట్టి హద్దులు వేశారు. కాగా.. జంక్షన్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రముఖ వ్యక్తికి చెందిన ఫార్మా పరిశ్రమకు ఎలాంటి నష్టం కలిగించకుండా ఉండేలా నూతన డిజైన్ రూపొందించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలైన్‌మెంట్ మార్పు విషయంలో పారదర్శకత పాటించలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూమికి భూమి ఇవ్వాలని, బహిరంగ మార్కెట్ ధర ప్రకారంగా పరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు.

ఆందోళనలు, వినతులు


నూతన అలైన్‌మెంట్ వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని బాధితులు ఆందోళనలకు దిగుతున్నారు.ఇప్పటికే ప్రభుత్వంలోని పెద్దలను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ప్రభుత్వ భూముల వైపు మళ్లించాలి



జయభూమి వెంచర్‌లో డంబెల్ ఆకారం ప్రారంభమయ్యే ప్రాంతానికి సమీపంలో ప్రభుత్వ, గోల్డెన్‌ఫారెస్ట్ భూములు అందుబాటులో ఉన్నాయి. అటువైపు కాకుండా పడమర వైపు అలైన్‌మెంట్ మార్చడం ద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజలం తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రస్తుతం మార్చిన అలైన్‌మెంట్ ద్వారా మేము ఉమ్మడిగా ఏడు ఎకరాల భూమి కోల్పోవాల్సి వస్తుంది. ఇక్కడ ప్రస్తుతం గజం రూ.20వేలు పలుకుతుంది. ఆలెక్కన సుమారు రూ.50 కోట్లు నష్టపోతున్నాం. ఇప్పటికైనా తూర్పు వైపు అలైన్‌మెంట్ జరపాలి. –గుజ్జుల సురేందర్‌రెడ్డి, రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసితుడు, చౌటుప్పల్

పేదల పొట్టకొట్టొద్దు



చౌటుప్పల్ వద్ద జంక్షన్ కోసం అప్పట్లోనే అలైన్‌మెంట్ రూపొందించారు. అప్పటి అలైన్‌మెంట్ ప్రకారం అమ్మానాన్న అనాథాశ్రమం ప్రాంతంలో ఎవరికీ పెద్దగా నష్టం జరగడంలేదు. కానీ, జంక్షన్ విస్తరణ కోసం నూతనంగా మరో అలైన్‌మెంట్ రూపొందించారు. అందుకోసం అదనంగా భూములు సేకరిస్తున్నారు. వెంచర్‌లోకి రోడ్డు ఎందుకు వస్తుందో మాత్రం తెలియడంలేదు. పెద్దల మేలుకోసం అధికారులు పనిచేస్తున్నట్టు అనిపిస్తుంది. పేదల పొట్టకొట్టొద్దు. –గోపగోని లక్ష్మణ్‌గౌడ్, సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, చౌటుప్పల్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

సంస్థాన్ నారాయణపురం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన పందరి రాములు(59) బుధవారం తన మనవడి బారసాల కోసం ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామానికి వచ్చాడు. గురువారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం రాములు చౌటుప్పల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అక్కడ నుంచి హైదారాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

బీఫార్మసీ విద్యార్థిని..

గరిడేపల్లి: మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఫార్మసీ విద్యార్థిని మృతి చెందింది. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన పిడమర్తి స్రవంతి(21) కోదాడలోని తేజ కళాశాలలో బీఫార్మసీ ఫైనలియర్ చదువుతోంది. గురువారం ఆమె తన బంధువైన పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన బంకు నాగరాజు బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. మార్గమధ్యలో గరిడేపల్లి మండలం అప్పన్నపేట శివారులోకి రాగానే మద్యం మత్తులో లారీ నడుపుతున్న డ్రైవర్ వెనుక నుంచి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్రవంతి అక్కడికక్కడే మృతిచెందగా, నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. నాగరాజును చికిత్స నిమిత్తం స్థానికులు హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాగరాజు కోదాడలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ సంఘటనపై ఎస్ఐ చలిగంటి నరేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బావిలో పడి యువకుడి మృతి


వెంకటేష్ (ఫైల్)

అడ్డగూడూరు: వ్యవసాయ బావిలోని మోటారుకు వాచర్‌ను అమర్చేందుకు లోపలికి దిగుతుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండల పరిధిలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పర్రెపాటి సైదులు, లక్ష్మి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు వెంకటేష్(27) ఉన్నాడు. గురువారం తండ్రి సైదులుతో కలిసి వెంకటేష్ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావిలోని మోటారుకు కంట్రోల్ వాచర్‌ను అమర్చడానికి వెంకటేష్ బావిలోకి దిగుతుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. అతడి తండ్రి గమనించి కేకలు పెట్టడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి వెంకటేష్‌ను బావి నుంచి బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

జూదరుల అరెస్ట్

కట్టంగూర్: పేకాట ఆడుతున్న ఆరుగురిని కట్టంగూర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం బొల్లేపల్లి గ్రామంలో కొందరు పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి దాడులు నిర్వహించగా ఆరుగురు పట్టుబడ్డారు. వారి నుంచి నగదు రూ.11,400, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్. శ్రీను తెలిపారు.

గవర్నర్ పర్యటన చిత్రమాలిక..


కొలనుపాక జైన దేవాలయం గురించి గవర్నర్ జిష్ణుదేవ్ శర్మకు వివరిస్తున్న అధికారులు, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తదితరులు


కొలనుపాక జైన దేవాలయంలో హారతి ఇస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ


గవర్నర్‌కు మొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న యాదాద్రి కలెక్టర్ హనుమంతు కె.జెండగే


స్వర్ణగిరి దేవాలయంలో గర్నర్ జిష్ణుదేవ్ శర్మను సన్మానించిన ఆలయ నిర్వాహకులు, చిత్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

డివైడర్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు దుర్మరణం

- మరో నలుగురికి గాయాలు

కేతేపల్లి: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కేతేపల్లిలో గురువారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన సొంటి కృష్ణసంతోష్ తన తండ్రి దుర్గ మల్లేష్‌ప్రసాద్, తల్లి శివనాగమల్లేశ్వరీ(63), మేనత్తలు పామర్తి పార్వతి, గుడిపల్లి అలివేలమ్మతో కలిసి విజయవాడలో తన మేనత్త అంత్యక్రియలకు కారులో గురువారం తెల్లవారుజామున బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లిలోని డి పాల్ స్కూల్ సమీపంలోకి చేరుకోగానే కారు నడుపుతున్న కృష్ణసంతోష్ నిద్రమత్తులోకి జారుకోవడంతో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కృష్ణసంతోష్ తల్లి శివ నాగమల్లేశ్వరి(63) అక్కడికక్కడే మృతిచెందింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో డ్రైవింగ్ చేస్తున్న కృష్ణసంతోష్‌తో పాటు ముందు కూర్చున్న అతడి తండ్రి దుర్గ మల్లేష్‌ప్రసాద్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కృష్ణ సంతోష్ మేనత్తలు పామర్తి పార్వతి, గుడిపల్లి అలివేలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు కారు నడుపుతున్న కృష్ణసంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు

పెద్దఅడిశర్లపల్లి: తన స్నేహితుడి సోదరి పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి గ్రామ స్టేజీ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అందుగుల పెద్దతండాకు చెందిన నేనావత్ రాజేష్(19), అదే మండలం పల్లెతండాకు చెందిన తన స్నేహితుడు కేతావత్ సంతోష్ సోదరి పెళ్లి కార్డులు పంచేందుకు నాగార్జునసాగర్ పరిధిలోని నాగార్జునపెంట తండాకు బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి గ్రామ స్టేజీ సమీపంలో రాగానే కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న నేనావత్ రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న సంతోష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గుడిపల్లి ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, క్షతగాత్రుడిని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమజంటను అప్పగించాలని ఆందోళన

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని తాళ్లసింగారం క్రాస్‌రోడ్ వద్ద గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆందోళనకు దిగారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న తాళ్లసింగారం గ్రామానికి చెందిన యువకుడు రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. ఇద్దరూ మేజర్లే కావడంతో ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకుని రక్షణ నిమిత్తం గురువారం చౌటుప్పల్ పోలీసులను ఆశ్రయించారు. వారిద్దరిని యువకుడి ఇంటి వద్ద వదిలేసేందుకు పోలీసులు నిర్ణయించి పెట్రోలింగ్ వాహనంలో పంపించారు. అయితే తాళ్లసింగారం క్రాస్‌రోడ్ వద్దకు వెళ్లగానే అమ్మాయి తరఫు వ్యక్తులు వారిని అడ్డగించి ప్రేమజంటను అపహరించుకుపోయారని యువకుడి తరఫు బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వ్యక్తులకు నచ్చజెప్పారు. ఈ విషయమై సీఐ మన్మథకుమార్‌ను సంప్రదించగా.. యువతిని మాత్రం వారి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారని తెలిపారు. యువకుడు స్థానికంగా క్షేమంగానే ఉన్నట్లు తమకు తెలిసిందని పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. వ్యక్తి మృతి

చివ్వెంల(సూర్యాపేట): బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన బోడపట్ల జానుగౌడ్(42) గురువారం బైక్‌పై సూర్యాపేటకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో చివ్వెంల మండల కేంద్రం శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై గల దీవెన ఫార్మసీ కళాశాల ఎదుట సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జానుగౌడ్ తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య


రజిత (ఫైల్)

గుర్రంపోడు: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కలపల్లి గ్రామానికి చెందిన జాల రజిత(30) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ సమయంలో భర్త దుర్గయ్య పశువులను కాసేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బుధవారం రజిత తల్లిగారింటికి వెళ్లిన ఆమె ఇద్దరు పిల్లలను తీసుకుని తమ్ముడు రమేష్ పోచంపల్లి నుంచి అక్క ఇంటికి రాగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. రజిత మృతిపై గ్రామానికి చెందిన జాల రాములుపై అనుమానం ఉన్నట్లు భర్త దుర్గయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

గుర్రంపోడు మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన షేక్ జుబేర్(25) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాలతోనే అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భావిస్తున్నారు. తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సాగర్ ఎడమ కాలువలో వ్యక్తి గల్లంతు


గోపాల్‌రెడ్డి

మునగాల: ఈత కొట్టేందుకు సాగర్ ఎడమ కాలువలోకి దిగిన వ్యక్తి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. ఈ ఘటన గురువారం మునగాల శివారులో జరిగింది. ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన గొట్టెముక్కుల గోపాల్‌రెడ్డి(40) గత పదేళ్లుగా కోదాడ పట్టణంలో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఏడాదిన్నర క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో ఓ లారీని కొనుగోలు చేసి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గురువారం స్వగ్రామమైన ఆత్మకూర్(ఎస్)కు వచ్చి బైక్‌పై కోదాడకు వెళ్తూ మార్గమధ్యలో మునగాల శివారులో సాగర్ ఎడమ కాలువలో ఈత కొట్టేందుకు దిగాడు. అతడికి ఈత వచ్చినప్పటికీ కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అందరూ చూస్తుండగానే మునిగిపోయాడు. అదే సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న కొందరు మునగాల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన వ్యక్తి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గోపాల్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు సమాచారం.

15 తులాల బంగారం పట్టివేత

కట్టంగూర్: మండలంలోని మాణిక్యాలమ్మగూడెం వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పారిపోగా ఒకరు దొరికాడు. పట్టుబడిన వ్యక్తి నుంచి సుమారు 15తులాల బంగారంతో పాటు 200 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపారు. పట్టుబడిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు పట్టణానికి చెందినవాడని, పారిపోయిన వ్యక్తుల వివరాల సేకరిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కోర్టు నుంచి పరారైన ఖైదీ


గోపి

కోదాడరూరల్: కోదాడ కోర్టుకు తీసుకొచ్చిన ఓ ఖైదీ పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. హుజూర్‌నగర్‌లోని ఎస్ఎస్‌పీ కాలనీకి చెందిన మామిడి గోపి ద్విచక్ర వాహనాలతో పాటు పలు ఆలయాలు చోరీ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. అతడిపై ఖమ్మం, కోదాడ తదితర పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. ఖమ్మంలో దొంగతనం చేసిన కేసులో అక్కడి పోలీసులు పట్టుకుని రిమాండ్ చేయగా ఖమ్మం జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. కోదాడలో ఓ కేసుకు సంబంధించి వాయిదా కోసం అతడిని కోర్టులో హాజరుపర్చేందుకు ఐడీ పార్టీ పోలీసులు గురువారం ఖమ్మం నుంచి కోదాడకు తీసుకొచ్చారు. నిందితుడు గోపి తన చేతికున్న బేడీలను చాకచక్యంగా తీసుకొని పోలీసుల కంటపడకుండా పరారయ్యాడు. వెంటనే అప్రమత్తమైన కోదాడ పట్టణ పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. ఖమ్మం క్రాస్‌రోడ్ వైపు వెళ్లాడనే సమాచారం తెలుసుకొని అక్కడ వెతకగా కనిపించలేదు. అటు నుంచి ఖమ్మం వెళ్లే మార్గం వైపు గాలిస్తుండంగా తమ్మర గ్రామ శివారులో దొరికినట్లు తెలిసింది. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

కారులో వచ్చి దారి దోపిడీ

- వృద్ధ దంపతులను అడ్డగించి పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దుండగులు


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

మోత్కూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధ దంపతులను గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి అడ్డగించి వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మోత్కూరు మండలంలోని అనాజిపురం, ముశిపట్ల, కలిమెకుంట్ల దారిలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన ఆసర్ల మల్లయ్య, సోమక్క ద్విచక్ర వాహనంపై మోత్కూరు మండలంలోని ముశిపట్లలో ఉంటున్న తమ కుమార్తె ఇంటికి వెళ్తున్నారు. అనాజిపురం–కలిమెకుంట్ల దారిలో వెళ్తున్న వారిని గుర్తుతెలియని వ్యక్తులు కారులో అనసరించి అడ్డగించారు. వాహనం దిగిన గుర్తుతెలియని వ్యక్తులు సోమక్క మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ ఏసీపీ పి. మధుసూదన్‌రెడ్డి, రామన్నపేట సీఐ ఎస్. వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధ దంపతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు మోత్కూరు, అడ్డగూడూరు, వలిగొండ ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, మహేందర్, హెడ్ కానిస్టేబుల్ నర్సింహ ఉన్నారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి


ఈశ్వర్ (ఫైల్)

కొండమల్లేపల్లి: నీటి సంపులో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా ఆదోని మండలం చిన్న హరివనం గ్రామానికి చెందిన చాకలి వీరస్వామి, ఉమ దంపతులు బతుకుదెరువు నిమిత్తం మూడేళ్ల క్రితం కొండమల్లేపల్లి పట్టణ కేంద్రానికి వలస వచ్చారు. వీరస్వామి మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఈశ్వర్(6) ఉన్నారు. గురువారం రాత్రి కొండమల్లేపల్లి పట్టణంలోని నల్లగొండ రోడ్డులో గల ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఈశ్వర్ తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటూ పక్కనే ఉన్న నీటి సంపులో పడిపోయాడు. తోటి చిన్నారులు చుట్టుపక్కల వారికి విషయం తెలపడంతో వారు వెంటనే వచ్చి బాలుడిని సంపు నుంచి బయటికి తీశారు. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

దొడ్డా సక్కుబాయమ్మ ఆదర్శప్రాయురాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- సక్కుబాయమ్మ సంస్మరణ సభకు హాజరైన కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


సక్కుబాయమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న కూనంనేని, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

చిలుకూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు సతీమణి దొడ్డా సక్కుబాయమ్మ ఆదర్శప్రాయురాలు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం చిలుకూరులో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డా సక్కుబాయమ్మ సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. సక్కుబాయమ్మ ఆశయ సాధనకు ప్రతి కమ్యూనిస్టు నాయకుడు కృషిచేయాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీకు దొడ్డా కుటుంబం చేసిన సేవలు మరవలేవని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పార్టీ కార్యదర్శులు పోటు ప్రసాద్, బెజవాడ వెంకటేశ్వర్లు, నెల్లికంటి సత్యం, సీపీఎం జిల్లా నాయకుడు ముల్కలపల్లి రాములు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వక్కవంతుల ప్రభాకర్, మండల కార్యదర్శి మందవ వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ప్రెస్ అకాడమీ చైర్మన్, కోదాడ ఎమ్మెల్యే..

దొడ్డా సక్కుబాయమ్మ సంస్మరణ సభకు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై సక్కుబాయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అదేవిధంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొని సక్కుబాయమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీలు బొలిశెట్టి నాగేంద్రబాబు, బండ్ల కోటయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ..

హుజూర్‌నగర్: రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం హుజూర్‌నగర్‌కు వచ్చిన ఆయనకు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక రహదారి బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, సమాచార ప్రసారాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పలు దఫాలుగా చర్చలు జరిపి హైపవర్ కమిటీ ఏర్పాటు చేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రూట్ క్లియర్ చేసినట్లు వెల్లడించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి సెప్టెంబర్ మొదటి వారంలో సీఎం కీలక ప్రకటన చేస్తారని తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చాముల శివారెడ్డి కె. శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. సమావేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్ ఎన్. నరేందర్‌రెడ్డి, బి. శ్రీనివాసచారి, జానీపాషా, డి. వెంకటరెడ్డి పాల్గొన్నారు.

భర్త గొంతు నులిమి హత్య చేసిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని ఘాతుకం


వెంకన్న మృతదేహం

నల్లగొండ క్రైం: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను గొంతు నులిమి భార్య హత్య చేసింది. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని ముశంపల్లి రోడ్డులో గల హైటెక్ కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని రాయపాడు గ్రామానికి చెందిన ఓర్సు వెంకన్న(50), తన భార్య మైసమ్మతో కలిసి నల్లగొండ పట్టణంలోని ముశంపల్లి రోడ్డులో గల హైటెక్ కాలనీలో కొంతకాలంగా చిన్న గుడిసె వేసుకుని నివాసముంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మైసమ్మకు నల్లగొండ మండలంలోని వెలుగుపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మన్నె భిక్షంతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం వెంకన్నకు తెలియడంతో పలుమార్లు భార్యను మందలించాడు. ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని మైసమ్మ భావించింది. బుధవారం రాత్రి భార్యాభర్తలిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మైసమ్మ తన భర్త వెంకన్నను గట్టిగా నెట్టేసింది. అతడు కిందపోగా.. గొంతు నులిమి హత్య చేసింది. గుండెపోటుతో తన భర్త చనిపోయాడని ఇరుగుపొరుగు వారికి చెప్పి నమ్మించింది. గురువారం ఇరుగుపొరుగు వారు మృతుడి తలపై గాయం అవ్వడం, గొంతు నులిమినట్లుగా ఉండటంతో నల్లగొండ వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మైసమ్మను తనదైన శైలిలో విచారించగా.. తానే హత్య చేసినట్లు అంగీకరించింది. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుని వివాహం కావాల్సి ఉంది. మైసమ్మ ప్రియుడు భిక్షంకు వివాహం కాగా భార్య గొడవ పడి భర్తకు దూరంగా ఉంటుంది. మృతుడి సోదరుడి కుమారుడు ఓర్సు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వారం రోజుల్లో రికవరీ చేస్తాం


రికార్డులను పరిశీలిస్తున్న ఏపీఎం

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామంలో పలు సమాభావన సంఘాలకు చెందిన శ్రీనిధి లోన్ల డబ్బుల స్వాహాపై గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంపై మండల సమాఖ్య అధికారులు స్పందించారు. చిలుకూరు మండల సమాఖ్య కార్యాయలంలో శ్రీనిధి లోన్లకు సంబంధించిన రికార్డులను ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీలు కందుకూరి గురుమూర్తి, స్వరూప పరిశీలించారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ.. మరో వారం రోజుల్లో శ్రీనిధి లోన్ల డబ్బులను రికవరీ చేస్తామని అన్నారు. ఇందుకు సంబంధించి వీవీకే వద్ద నుంచి లిఖితపూర్వకంగా హామీ తీసుకున్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శ్రీనిధి లోన్లకు సంబంధించి రికార్డులు తనిఖీ చేసి పెండింగ్ డబ్బులను రికవరీ చేస్తామని అన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

భువనగిరి క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి బైపాస్ రోడ్‌లో గురువారం రాత్రి జరిగింది. రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని బీచ్మహల్లాకు చెందిన సయ్యద్ శానూర్(36) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన భువనగిరి బైపాస్ రోడ్డులో గచ్చుబావి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు సయ్యద్ జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.